మహబూబ్‌నగర్
వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట

# ఆరోగ్య రక్షణలో పారిశుద్ధ్య కార్మికులది కీలక పాత్ర

**మీ కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది.. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**కలెక్టర్ విజయేంద్ర బోయితో కలిసి మున్సిపల్ కార్మికులకు పిపిఈ కిట్ల పంపిణీ**



కార్మికులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** మీ కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్‌లోని శిల్పారామంలో మహబూబ్ నగర్ కార్పోరేషన్‌లో పనిచేస్తున్న 400 మంది పారిశుద్ధ్య కార్మికులకు పిపిఈ కిట్లు, యూనిఫాంలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరంతా కష్టపడి పనిచేస్తున్నందుకే మహబూబ్ నగర్ పరిశుభ్రంగా ఉందన్నారు. గతంలో మహబూబ్ నగర్ మున్సిపాలిటీగా ఉండేదని, ఇప్పుడు కార్పోరేషన్‌గా అభివృద్ధి చెందిందని మనందరిపైన బాధ్యత మరింత పెరిగిందన్నారు. మీ సమస్యలను పరిష్కరిస్తామని, మీ అందరికి కూడా ఆరోగ్య భీమా గురించి అధికారులతో మాట్లాడి వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ చెత్త,నీరు నిలువ ఉండడం వలన దోమల ద్వారా డెంగ్యూ,జ్వరాలు ప్రబలుతాయని అన్నారు. కార్పోరేషన్‌గా మారిన నగరంను పచ్చదనం, పరిశుభ్రతలో మొదటి గా ఉండేలా అందరం కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## మెనూ ప్రకారం

# భోజనం వడ్డిస్తున్నారా

**అన్ని వసతులు బాగున్నాయా**

**విద్యార్థులతో కలెక్టర్ విజయేందిర బోయి**

**జడ్చర్ల తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల తనిఖీ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జడ్చర్ల, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం జడ్చర్ల పట్టణంలో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల1(ఇంగ్లీష్ మీడియం) జిల్లాకలెక్టర్ విజయేందిరబోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, పరిసరాలను,మెనూ పరిశీలించారు.మెనూ ప్రకారం భోజనం అందించకపోవడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు డైట్ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని, భోజనం సిద్ధం చేస్తున్న సిబ్బంది –మిగతా4లో.




మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి

## పశువుల దొంగల అరెస్టు

# రూ.14.5 లక్షల ఆస్తి స్వాధీనం

**మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి**

**నవాబుపేట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** కొద్ది నెలలుగా అర్ధరాత్రి పశువులను దొంగతనంగా తరలిస్తూ ఈజీ మనీకి పాల్పడిన దొంగల ముఠాను గురువారం ఎట్టకేలకు నవాబుపేట పోలీస్ టీం చాకచక్యంగా దొంగల ముఠాను అరెస్టు చేశారనిజిల్లా ఎస్పీ జానకి, నవాబుపేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అన్నారు. నిందితులనుండి రూ.14.50 లక్షల విలువైన ఆస్తి 15 పాడి పశువులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నవాబ్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పశువుల దొంగతనాలపై పోలీసులు ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో పక్కాప్లాన్‌తో నలుగురు నిందితులను పట్టుకున్నారని పోలీస్ సిబ్బందిని ఎస్పీ జానకి అభినందించారు. ఈ నెల రెండవ తేదీ ఉదయం 9.20 గంటలకు మరికల్ గ్రామ శివారులో పశువులు దొంగతనం జరిగినట్టు ఫిర్యాదు నమోదైంది. ఫిర్యాదుదారు అంబటి రాములు, మరికల్ గ్రామం,చౌడపూర్ మండలం తన పొలంలో –మిగతా4లో.



తిరుమలపూర్ పాఠశాల చెరువుల తలపిస్తున్న ప్రాంగణం

## వర్షపు నీరు ఇలా..

# పాఠశాలలోకి వెళ్లేది ఎలా..

**సీఎం వ్యక్తిగత సహాయకుని స్వగ్రామంలో... ఆందోళనకు గురైన విద్యార్థులు**

**ఉప్పునుంతల, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు వెల్దండ జయపాల్ రెడ్డి స్వగ్రామమైన తిర్మా లపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోకి వర్షపు నీరు చేరింది. గురువారం ఉదయం పాఠశాల ప్రారంభమైన తర్వాత ఎడతెరిపి లేకుండా వర్షం రావడంతో వర్షపు నీరు పాఠశాలల గదులకు చేరి పోయింది. పాఠశాల ప్రాంగణం చెరువుల తలపించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పాఠశాల మొత్తం చెరువుల మారిపోయింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని తిరుమలపూర్ గ్రామంలో నడుస్తున్న పాఠశాలను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు రావడానికి జంకుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపించాలని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తామని ఎంతో ఆర్భాటంతో ప్రచారాలు నిర్వహిస్తున్నప్పటికీ, గ్రామాలలో పాఠశాల వసతులు దయనీయ పరిస్థితిలో నెలకొంది. ఇలా వర్షపు నీరు పాఠశాలలో కి చేరితే తమ పిల్లలకు విద్య భవిష్యత్తు ఏంటి అని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే స్పందించి తిరుమలాపురం గ్రామంలో వెంటనే నూతన భవనం నిర్మాణం చేపట్టి విద్య కొనసాగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# ఎరువులు ఏమవుతున్నాయి..

**దేవరకద్రలో యూరియా కోసం ఎగబడుతున్న జనం**



యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

**దేవరకద్ర, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** గత పదేళ్లుగా దేవరకద్ర నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం నికరంగానే ఉంది. కాస్త ఆలస్యంగా కురిసిన వర్షాలకు ఇటీవల వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.అయితే సాగుపనులలో నిమగ్నం అవ్వాల్సిన రైతులు ఎరువుల కోసం ఎగబడుతున్నారు. అధికారులు పుష్కలంగా యూరియా నిలువలు ఉంటున్నాయి అంటున్నారు. అయితే ఎక్కడికక్కడ యూరియా అందక రైతులు అల్లాడుతున్నారు. 100 బస్తాలు వచ్చాయంటే పదింతలుగా రైతులు పోటెత్తుతున్నారు.గంటల తరబడి క్యూలో నిరీక్షించిన ఒక్క బస్తా కూడా దొరకడం లేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్షం రోజులుగా ఇదే తంతు. దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల, మండలాలలో గత పక్షంరోజులుగా యూరియా హాట్‌టాపిక్‌గా మారింది. రైతులు పనులన్నీ పక్కనపెట్టి యూరియా కోసం కేంద్రాల వద్ద పడి కాపులు కాస్తున్నారు. యూరియా నిలువలు పుష్కలంగా ఉన్నాయని అధికారులు చెబుతున్న వాస్తవానికి క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు.

## యూరియా కోసం

# పంపిణీ కేంద్రాల వద్ద రైతన్న నిద్ర

**దామరగిద్ద, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** యూరియా ఎరువుల కొరత రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టివేసింది. వ్యవసాయ పనులు ఆపి, పంపిణీ కేంద్రాల వద్ద నిద్రపోతూ ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు. రైతులు క్యూలైన్లలో రాత్రిపూట నిద్రపోవాల్సి వస్తోంది. దామరగిద్ద రైతు అగ్రోస్ కేంద్రం వద్ద వివిధ గ్రామల ప్రజలు యూరియా కోసం రైతులు క్యూలైన్లలో ఉన్నారు. వరి పంటకు యూరియా అత్యవసరం అని, దొరకకపోవడంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



యూరియా కోసం రైతుల పడిగాపులు



మన గ్రోమోర్ వద్ద బారులు తీరిన రైతులు

# రైతులకు తప్పని యూరియా తిప్పలు

**బాలానగర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఉదయం లేవగానే మండల కేంద్రంలోని ప్రాథమిక సహాయ సహకార సంఘం, మన గ్రోమోర్ సెంటర్ల వద్ద క్యూ లైన్‌లో నిలబడి అధికారులు ఇచ్చిన ఒక యూరియా బస్తా తీసుకెళ్తున్నారు. తాము వేసిన పంటకి ఒక యూరియా బస్తా సరిపోవడంలేదని అందుకే ప్రతిరోజు వచ్చి లైన్లో నిలబడి యూరియా బస్తాలు తీసుకెళ్తున్నామని రైతులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంటలకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



# వామ్మో చిరుత..

- భయాందోళనలో టీడీగుట్ట వాసులు
- రెండు నెలలుగా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఎమ్మెల్యే యెన్నం ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** చిరుత మహబూబ్‌నగర్ పట్టణవాసులకు నిద్ర లేకుండా చేస్తుంది. ముఖ్యంగా వీరన్నపేట, టిడిపి గుట్ట ప్రాంతంలో పలుమార్లు సంచరించడం జనాలకు కనిపించడంతో భయాందోళన చెందుతున్నారు. గురువారం టిడిగుట్ట వద్ద మళ్లీ చిరుత కనిపించడం ఆందోళనకు పట్టణ వాసులను గురిచేస్తున్నది. పాలమూరు నగర ప్రజలను చిరుత పులులు హడలెత్తిస్తున్నాయి. మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేట, టీడీగుట్ట మధ్య ఉన్న గుర్రంగట్టుపై రెండు నెలలుగా చిరుతలు సంచరిస్తున్నాయి. జూన్ 30న మొదటిసారి కనిపించగా మళ్లీ ఈ నెల జూలై 2న కనిపించి కలకలం రేపింది. దీంతో అటవీశాఖ అధికారులు బోను ఏర్పాటు చేశారు. బోనులో చిక్కకపోగా ఒకేసారి రెండు చిరుతలు కనిపించడం, అవి కూడా నివాస ప్రాంతాలకు సమీపంలోకి రావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. జనం అలికిడితో అవి వెనుదిరిగి మళ్లి గుట్టపైకి –మిగతా4లో.




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## నిర్మాణాల ప్రక్రియ

# వేగవంతం చేయాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంకా నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో గ్రౌండింగ్ చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో సీజనల్ వ్యాధులు, ఇందిరమ్మ ఇండ్లు సహా తదితరాంశాలపై కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి ఎంపీడీవోలతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంకా నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో గ్రౌండింగ్ చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపాలిటీలలో చాలా నెమ్మదిగా గ్రౌండింగ్ సాగుతోందని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వార్డ్ ఆఫీసర్లతో లబ్ధిదారులందరినీ పిలిపించి గ్రౌండ్ చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఎంపీడీవోలు ఏపీఎంలతో సమన్వయం చేసుకొని లబ్ధిదారులకు స్వయం సహాయక బృందాల ద్వారా రుణాలు ఇప్పించే సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి –మిగతా4లో.

# ఇంటిగ్రేటెడ్ కోర్టు శంకుస్థాపనకు సీఎంను ఆహ్వానిస్తాం

**రూ.81 కోట్లతో అద్భుతంగా నిర్మిస్తాం..**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**35 లక్షలతో ముడా నిధులతో నిర్మించనున్న పార్కింగ్ షెడ్ నిర్మాణపు పనులకు శంకుస్థాపన**

**విద్యా నిధికి రూ.5 లక్షల ప్రకటించిన సీనియర్ న్యాయవాది ప్రతాప్ కుమార్**



పార్కింగ్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** జిల్లాలో నూతనంగా నిర్మించనున్న ఇంటగ్రేటెడ్ కోర్టు భవనానికి శంకుస్థాపన చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కోర్టు ప్రాంగణంలో 35 లక్షలతో నిర్మించనున్న పార్కింగ్ షెడ్ నిర్మాణపు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కోర్టు భవనానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడం జరిగింది అని చెప్పారు.విజన్ 2047తో పనిచేస్తున్నామని, రానున్న 20 సంవత్సరాల కాలంలో నగరంలో కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. గత పది సంవత్సరాల కాలం మన మహబూబ్ నగర్ పూర్తిగా అభివృద్ధికి దూరంగా ఉందన్నారు.మహబూబ్ నగర్‌ను ప్రధానంగా ఎడ్యుకేషనల్ హబ్ గా, మెడికల్ హబ్‌గా, ట్రాన్స్ పోర్ట్ హబ్‌గా అభివృద్ధి చేయుటకు తాను కృషి చేస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను గెలిచిన తర్వాత మూడు ఇంజనీరింగ్ కళాశాలలను మహబూబ్‌నగర్‌కు తీసుకురావడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అందులో ఒకటి ఐఐఐటి కళాశాల అని అన్నారు. రాబోయే 10 సంవత్సరాల కాలంలో సుమారు 10 వేల మంది ఇంజనీర్లను కేవలం మన జిల్లా నుంచి ఇంజనీరింగ్ పట్టా పొందుతారని ఆయన గుర్తు చేశారు.అందుకే ఎక్కడైన కొత్తగా కంపెనీలు ఏర్పాటు చేస్తున్నా ముందుగా మహబూబ్ నగర్ చుట్టుపక్కల కంపెనీలు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామని తద్వారా, మన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో మన మహబూబ్‌నగర్ కు అగ్రికల్చర్, ఫార్మసీ, అదనంగా మరొక్కటి పాలిటెక్నిక్ కళాశాలను కూడా తెచ్చి ఇక్కడ పుట్టిన పిల్లలు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన అవసరం లేకుండా ఇక్కడనే చదువుకొనే విధంగా ఇంకా అధునాతన కోర్సులు, కాలేజ్‌లను తెస్తామన్నారు. కోర్టు ఆవరణలో విద్యానిధి ద్వారా డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయడానికి కంప్యూటర్లు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. యువ న్యాయవాదుల కోసం,మహిళా న్యాయవాదుల కోసం రీడింగ్ రూం ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. సీనియర్ న్యాయవాది ప్రతాప్ కుమార్ విద్యానిధికి తాను రూ.5 లక్షలు విరాళం ఇస్తానని ఆ డబ్బును కోర్టు ఆవరణలో ఏర్పాటు చేయనున్న డిజిటల్ లైబ్రరీ కోసం వినియోగించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ప్రతాప్ కుమార్‌ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జిల్లా న్యాయవాదులకు ఆయన హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంతరెడ్డి, కార్యదర్శి శ్రీధర్ రావు, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కుర్మయ్య, ఇసి సభ్యులు ఇలియాజ్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ ఆర్థిక ప్రగతికి బ్యాంకులే కీలకం

**- ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సమయానికి రుణాలు ఇవ్వాలి..**

**- రుణ పంపిణీ 100 శాతం వంద సాధించాలి...**

**- రైతులకు ఎక్కువగా వ్యవసాయ లోన్లను అందించాలి...**

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** ప్రభుత్వాలు అర్హులైన లబ్ధిదారులకు అనేక సంక్షేమ పథకాల కింద రుణాలను మంజూరు చేస్తున్నాయని, ఆ రుణాలు నిజమైన అర్హులకు చేరేలా బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం నుంచి వారికి రుణాలు అందించే వరకు బ్యాంకు అధికారులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించాలన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశాన్ని అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నిర్వహించారు. ఈ సమావేశంలో బ్యాంకు నియంత్రణ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. డిసిసి, డి.ఎల్.ఆర్.సి (బ్యాంకర్ల) సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ బ్యాంకు అధికారులు రుణ పంపిణీలో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం సాధించాలనే కట్టుబాటుతో పనిచేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు రుణాలు అందించడం అత్యంత అవసరమని, అలా చేస్తే మాత్రమే సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని వివరించారు. బ్యాంకర్లు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి, ఇంకా పెండింగ్‌లో ఉన్న రుణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల దరఖాస్తులను ఆలస్యం చేయకుండా పరిశీలించి, అర్హత ఉన్నవారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సి వచ్చినా, స్పష్టమైన కారణాలను తెలియజేయడం తప్పనిసరి అని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, పీఎం సూర్యఘర్, స్టాండ్ అప్ ఇండియా, పీఎంఈజీపీ, ముద్రా లోన్స్ వంటి పథకాల కింద ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని హెచ్చరించారు. వ్యవసాయ రంగంలో రైతులు అవసరమైన రుణాలు పొందేలా బ్యాంకులు చురుకుగా వ్యవహరించాలని, వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆర్థిక సాయం చేయడం ద్వారా జిల్లాలో వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు. అలాగే, ఉన్నత విద్య కోసం ఆసక్తి చూపుతున్న అర్హులైన విద్యార్థులకు విద్యారుణాలు అందించడంలో బ్యాంకులు ముందడుగు వేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా అధికారులు, బ్యాంకర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పథకాల అమలులో జాప్యం జరగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. తదుపరి దిశ సమావేశానికి రుణాల వివరాల పూర్తి సమాచారంతో అందరు బ్యాంక్ అధికారులు హాజరు కావాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లా ప్రగతి సాధించడానికి బ్యాంకుల పాత్ర కీలకమని, అంకితభావంతో పనిచేస్తేనే ప్రజలకు ప్రభుత్వం అందించే ఆర్థిక మద్దతు ఫలితాలు సమర్థవంతంగా అందుతాయని కలెక్టర్ బాదావత్ సంతోష్ సమావేశంలో వివరించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, ఆర్బిఐ దీపోజిట్ బోర్వా, నాబార్డ్ ఏజీఎం మనోహర్ రెడ్డి, ఎస్బిఐ ఆర్ యం సునీత, యూబిఐ ఏజీఎం మురళీకృష్ణ, టిజిబి ఆర్ ఎం వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ శాఖల బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలనాధికారులకు నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్



నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** రెవెన్యూ శాఖలో ఎంపికైన గ్రామ పాలనాధికారులకు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ నియామక పత్రాలను అందజేశారు. గురువారం ఐడిఓసి కలెక్టర్‌చాంబర్ నందు గ్రామ పాలనాధికారుల నియామక పత్రాలు కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అములులో భాగంగా జీపీవోల నియామకాలను చేపట్టినట్లు తెలిపారు. భూ సంబంధిత విధి నిర్వహణలో పారదర్శకతతో, నిబద్ధతతో న్యాయబద్ధంగా పని చేయాలని గ్రామ పరిపాలన అధికా రులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, సర్వే నంబర్లు, చెరువులు, కుంటలు, శిఖం భూములు, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పర్యవేక్షణ.. తదితర ప్రభుత్వ పరిపాలన వ్యవహారాలన్నీ సమర్థవంతంగా పర్యవేక్షి ంచాలన్నారు. గ్రామీణ స్థాయిలో అన్ని ధ్రువీకరణపత్రాల విచారణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు ఎంపికలో నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా వ్యవహరించడమే కాక, గ్రామస్థాయిలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయకర్తలుగా కూడా జీపీవోలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఎ.ఓ. భూపాల్ రెడ్డి, గ్రామ పరిపాలన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కొరతను తీర్చాలి..

**తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం**



రైతు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి

**అమరచింత సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రైతుల కు యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల తహసిల్దార్ రవికుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి, బి. వెంకటేష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన కోట ఇవ్వకపోవడం వల్ల రైతులకు యూరియా కొరత ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందు జాగ్రత్తగా యూరియా సరపర చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సకలంలో వర్షాలు పడడం వల్ల పంటలు ముందుగా వేసుకున్నారని యూరియా కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులకు యూరియా దొరకడం లేదని ఆయన అన్నారు. అలాగే డీలర్లు 40 కిలోల యూరియా బస్తాకు 265 ధర ఉన్న అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వెంటనే వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా కొరతను తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అంజిరెడ్డి, రాజు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిలర్ ఏర్పాటు



మాట్లాడుతున్న ఎస్టియు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి

**ఉప్పునుంతల, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల సంఖ్య 185 ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల సహకా రాన్ని పెంపొందించి వారి సంక్షేమానికై పలు సమస్యలను పరిష్కరించేందుకు స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) వ్యవస్థాపక సంఘ ముగా తెలంగాణ సివిల్ సర్వీస్ జెయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయడం పట్ల నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యద్ర్శి కొత్త శ్రీధర్ రావు, మురళిలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ప్రతి నాలుగు నెలలకు ఒక మారు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ పెద్దలతో ప్రభుత్వ అధికారులు 30 మంది సభ్యులుగా సమావేశమై పేరుకుపో యిన సమస్యలను పరిష్కరించేందుకు మార్గం సుగమమైనదని 79సంవత్సరాల చరిత్రగల ఎస్టియు ముందుచూపులకు ఇది నిదర్శనమని వారన్నారు. గత ప్రభుత్వం దీనిని రద్దుచేసి ఉద్యోగు ల సంక్షేమాన్ని గాలికి వదలడం పట్ల భారీ మూల్యం చెల్లించుకున్నదని ఆ సంఘ ప్రతినిధులు హనుమంత్ రెడ్డి, ఒగ్గు సుదర్శన్, ఈశ్వర్, రమేష్, పోకల సతీష్, రవి శేఖర్, సత్యనారాయణ, ప్రభాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు మాజీ జిల్లా అధ్యక్షులు మామిళ్ల సుదర్శన్, లక్ష్మారావు, సత్యనారాయణ, సింగోటం తదితరులు పేర్కొన్నారు.

## ప్రజలు డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

**డెంగ్యూ సోకిన వ్యక్తిని పరామర్శించిన మెడికల్ ఆఫీసర్**

**నవాబ్‌పేట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** ప్రజలు డెంగ్యూ జ్వరలపై అప్రమత్తంగా ఉండాలని చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గురువారం మండల కేంద్రంలోని డెంగ్యూ సోకిన రోగిని పరామర్శించి వైద్య సదుపాయాలపై అరా తీశారు. పరిసరాలన్నింటినీ పరిశీలించి, అవసంమైన చోట ఆయిల్ బాల్స్ కాల్చుమని గ్రామ పంచాయితీ సిబ్బందికి కార్యదర్శికి సూచించారు. అదేవిధంగా జ్వరం ఉన్నవారు నవాబ్‌పేట పిహెచ్‌సిలో వైద్యం చేయించుకోవాలని వారికి రక్త పరీక్ష చేయించు కోవాలని అన్నారు. ఏఎల్‌ఓ కార్యకలాపాలు ఫీవర్ సర్వేను కొనసాగించాలని కూడా సలహా ఇచ్చాడు. జిల్లా మలేరియా కార్యాలయ బృందం నుండి75 ఇళ్లలో పైరాట్రామ్ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో అశోక్ రాజ్ సబ్‌యూనిట్ ఆఫీసర్ రాములు, ఎంపీహెచ్‌ఈఓ బాలమ్మ, పిహెచ్‌ఎన్ శరభలింగం, జానకి రాములు, శ్రీనివాసులు, శారద, స్థానిక ఏఎన్‌ఎం జిపి కార్యదర్శి కరోబార్ ఆశా నిర్మల, మాధవి, సరోజ, లక్ష్మి ఉన్నారు.

## వెల్టూరు కాలువ మార్పు చేయాలని వినతి

**ఉప్పునుంతల, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ పొలాల మీదుగా వెళ్తున్న మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన కాలువ మార్పును చేయాలని కోరుతూ గురువారం ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వెల్టూరు శివారులో డిఐఎల్ మైనర్ కాలువ సర్వేనెంబర్ 211,212 లా మీదుగా వెళుతుండడం తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిలోని వెల్టూరు స్టేజ్ వద్ద చాలామంది ఇండ్లు నిర్మించుకున్నారని, దీంతో అభివృద్ధి కుంటుపడుతుందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కావాలంటే సర్వే నెంబర్ 209,210,211 నెంబర్ల మీదుగా తీసుకెళ్లాలని, ఈ నెంబర్ల గుండా డొంక రోడ్డు కావడంతో ఇబ్బంది లేదని ఇరిగేషన్ అధికారులు వెంటనే కాల్వమార్పు పట్ల చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎదిగేషన్ అధికారులకు వినతి పత్రం అందజేసిన వారిలో కాశిం శెట్టి వెంకటేష్, సత్యనారాయణ, లింగమయ్య, గుద్ధటి బాలరాజు, శేఖర్, కురుమయ్య, మల్లయ్య, నాగార్జున, జంగయ్య, బలరాం, మాషయ్య, బాలయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## విఆర్‌ఎల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం



ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేసిన కుటుంబ సభ్యులు

**అలంపూర్ సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** జోగులంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గానికి చెందిన విఆర్‌ఎలు బుధవారం నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి, విఆర్‌ఎల స్థానంలో వారి వారసులకు తక్షణం ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా, వీఆర్‌ఎలు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020లో అసెంబ్లీలో వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి, దీర్ఘకాలిక సమ్మెల తరవాత జీఓ నెం.81, 85లు విడుదల చేసినప్పటికీ, ఇప్పటికీ ఆ హామీలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20,555 మంది విఆర్‌ఎల్లో 16,758 మంది మాత్రమే సర్దుబాటు కాని, మిగతా 3,797 మంది వారసులు రెండు సంవత్సరాలుగా నిరీక్షణలో ఉన్నారన్నారు. ఆలస్యాలు, అనిశ్చితి కారణంగా విఆర్‌ఎ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు, అప్పుల బారిన పడుతున్నాయని, ఇప్పటివరకు 340 మంది విఆర్‌ఎలు మరణించగా అనేక కుటుంబాలు కష్టాల్లో కూరుకుపోయాయని వారు గుర్తుచేశారు. తండ్రుల స్థానంలో వారసులను నియమించడం ద్వారా ప్రభుత్వానికి పెద్ద భారమూ లేకుండా, చదువుకున్న యువత రెవెన్యూ శాఖ పనితీరును మెరుగుపరుస్తారని వీఆర్‌ఎలు తెలిపారు. వినతిపత్రం స్వీకరించిన ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ, వీఆర్‌ఎల సమస్యలను తప్పకుండా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని" హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ఖిల్లాలో జోరుగా అక్రమ ఇసుక రవాణా

**ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అనుమతులు ఓబులాపురం మైన్స్‌ను తలపిస్తున్న పిల్లివాగు ప్రాంతం**



పిల్లి వాగు ప్రాంతంలో ఇసుక తరలింపు కోసం వినియోగిస్తున్న యంత్రాలు

**ఖిల్లా గణపురం సెప్టెంబర్ 11, ప్రభాత వార్త:** గత మూడు సంవత్సరాలుగా మల్కిమి యాన్ పల్లి పిల్లివాగు ప్రాంతం ఓబులాపురం మైన్స్ ప్రాంతాన్ని తలపిస్తోంది. సిసి రోడ్లు అంటూ ప్రభుత్వ పనులు అంటూ మూడేళ్లుగా పిల్లివాగు ప్రాంతం నుండి రైతుల పొలాల నుంచి అనుమతులు ఉన్నాయని అక్రమ ఇసుక రవాణాకు రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులు ఇసుక దందాకు పూనుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన తర్వాత వాటి పేరుతో రెవెన్యూ కార్యాలయం నుండి ఒక్కో ట్రాక్టర్కు మూడు ట్రిప్పులని అనుమతులు తీసుకుని పది ట్రిప్పుల వరకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది. గత మూడు నాలుగు రోజులుగా ఏకంగా ఐదు హిటాచీలు 60 ట్రాక్టర్లతో ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక అంటూ అక్రమంగా తరలించకపోతున్నారు. కొన్నిచోట్లలో ఒక ఇంద్రమ్మ ఇల్లుకు రెండు ట్రిప్పులు వేసి మిగతాదంతా ప్రైవేటు ఇండ్లతో పాటు అక్కడక్కడ ఇసుకను డంపు చేసుకుంటున్నారు. గత ఏడాది పిల్లి వాగు ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇసుకను తవ్వుతుండడంతో పై ప్రాంతంలో ఉన్న రైతుల పొలాలు కోతకు గురవుతుండడం దళిత రైతులు ఉండడంతో ఎవరు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు గణపురం ఘనప సముద్రానికి నీటిని మళ్లించే చెక్ డ్యామ్ గతంలో కురిసిన భారీ వర్షాలకు తెగిపోవడంతో తమ భూములన్నీ కోతకు గురవుతున్నాయని దానిని మరమ్మత్తు చేయడం లేదు కానీ ఇక్కడి నుండి ఇసుక తరలింపుకు పర్మిషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. మూడు నెలల క్రితం కొంతమంది అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు రాత్రివేళలో ఇదే పిల్లి వాగు నుండి హిటాచిలతో టిప్పర్ల సహాయంతో దాదాపు రెండు నెలలపాటు పోలీస్ స్టేషన్ పక్కనుండే అక్రమ ఇసుక రవాణా చేశారనిరెవెన్యూ పోలీసు అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి చెప్పడంతో స్పెషల్ పార్టీ పోలీసులు ఆరు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేశారు అప్పుడు కేసు నమోదు చేసిన తేదీలలో పోలీస్ స్టేషన్ సి సి కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తే ఎంతటి భారీ అక్రమ ఇసుక రవాణా జరిగిందో తెలుస్తోందంటున్నారు కేసు నమోదైన తరువాత అప్పటినుండి కొంతకాలం ఇసుక రవాణాను నిలిపివేశారు. మళ్లీ ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమార్కులు అడుగుపెట్టారు. మండలంలో ప్రభుత్వం గుర్తించిన ఇసుక క్వారీ అంతాయపల్లిలో ఉన్నదని గతంలో పలువురు ట్రాక్టర్ యజమానులు ఆన్లైన్ ఇసుక తరలింపు కోసం అనుమతులు తీసుకున్నారని ఇప్పుడు కూడా అక్కడ ఇసుక అందుబాటులో ఉన్నా కూడా కావాలని పిల్లి వాగు నుండి అక్రమంగా తరలించడానికి అనుమతులు ఇస్తున్నారని ఇది ఇలాగే కొనసాగితే ఈ ప్రాంతానికి చెందిన పలువురు రైతులు అనుమతులు ఇచ్చే రెవెన్యూ అధికారులపై కోర్టుకు వెళతామంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు కల్పించుకుని యంత్రాల సహాయంతో ఇసుక తరలింపును ఆపివేయాలని మనుషుల సహాయంతో నిజమైన ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుకను సరఫరా చేస్తే తమకేమీ ఇబ్బంది ఉండదని రైతులు వేడుకుంటున్నారు.

## హిందీ బోధనతో విద్యార్థులకు భాషా నైపుణ్యత పెరుగుతుంది

**స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి**

**ఉప్పునుంతల, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** పాఠశాల స్థాయిలో హిందీ బోధన ద్వారా విద్యార్థులకు భాషా నైపుణ్యతను పెంపొందిస్తుందని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, నాగర్ కర్నూల్ జిల్లా హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ బోధన ప్రాముఖ్యతపై హిందీ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ మన దేశానికి ఒక తాటిపై తీసుకెళ్లే ప్రధాన భాష, పాఠశాల స్థాయిలో హిందీ బోధన ద్వారా విద్యార్థులు భాషా నైపుణ్యాలతో పాటు సంస్కృతి, సాహిత్యం, జాతీయ ఏకత్వాన్ని అర్థం చేసుకుంటారని అని అన్నారు. ఉపాధ్యాయులు హిందీ బోధనను మరింత అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు నాటకాలు, పద్య పఠనం, వాద, వివాద పోటీలు డిజిటల్ తరగతులటువంటివి ఎంత ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు తన అనుభవాలను పంచుకుంటూ ఇంట్లో ఎక్కువ గా తెలుగు , ఇంగ్లీషు మాట్లాడుతున్నాం కానీ పాఠశాలల్లో ముందు హిందీ నేర్చుకోవడం వల్ల మూడో భాషలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు హిందీ గౌరవంగా వాడాలని దినచర్యలోనూ దాన్ని అలవార్చుకోవాలని ఆయా పాఠశాల హెచ్‌ఎంలు సూచించారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డితో పాటు కాంప్లెక్స్ సెక్రెటరీ శ్యామల గౌరి, అస్రాఫ్, గ్రూప్ల నాయక్, శ్రీనివాసులు, బలమురి బసవయ్య, నానకమ్మ, లీలా బాయి, కమల బాయి, ఉప్పునుంతల, అచ్చంపేట, బల్మూరు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో విశ్వకర్మల ప్రతిష్టను పెంచడమే లక్ష్యం

**విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ కన్వీనర్‌గా రమేష్ ఆచారికి నియామకం**

**నవాబుపేట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా విశ్వకర్మ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక పురోగతికి కృషి చేస్తున్న విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా నవాబుపేట మండలం యన్మన్ గండ్ల గ్రామానికి చెందిన రమేష్ ఆచారిని నియమించారు. బుధవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఫౌండర్ చీఫ్ విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ, "విశ్వకర్మల శక్తిని ఐక్యంగా సమీకరించి, గ్రామ స్థాయినుంచి రాజ్యాధికారంలో వాటసొంతం చేసుకునే దిశగా నాయకులను ఎదగనివ్వాలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గ కన్వీనర్ల నియామకాలు చేపడుతున్నాం,"అని తెలిపారు. రమేష్ ఆచారి నియామకం గురించి మాట్లాడుతూ, "అతడు నిబద్ధత కలిగిన నాయకుడు. విశ్వకర్మల కోసం సమగ్రంగా పనిచేస్తాడన్న నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించాం" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో యన్మన్ గండ్ల గ్రామానికి చెందిన రమేష్ ఆచారి మాట్లాడుతూ, "ఆత్మహత్యలు, ఆకలి చావులు వంటి సంక్షోభాల్లో ఉన్న విశ్వకర్మ సమాజాన్ని చైతన్యపరచాలన్నది నా సంకల్పం. విశ్వనాథుల పుష్పగిరి ఆదర్శాలను అనుసరిస్తూ, సెప్టెంబరు 17 నుండి ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వరకు నిర్వహించనున్న 1500 కిలోమీటర్ల పాదయాత్ర విజయవంతం కావడంలో ఆయన పూర్తి స్థాయిలో పాలుపంచుకుంటాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ జాతీయ కమిటీ సభ్యులు సొల్లేటి ప్రభాకరాచారి, పొలిటికల్ అనలిస్ట్ బి.జె.డి. స్థపతి, చామకూర రాజు, విశ్వప్రకాశ్ ఆచారి, బాణాల ద్రోణాచారి, తంగెళ్లపల్లి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పడి మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ ను కలిసిన డాక్టర్ ప్రేమ్ కుమార్**



జిల్లా అదనపు కలెక్టర్ ను కలిసి వినతిపత్రం ఇచ్చిన ఉద్యమకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్

**ఇటిక్యాల సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** అల్లంపూర్ నియోజకవర్గం ఐజ మండలం బూంపురం గ్రామంలో బుధవారం పిడుగు పడి మరణించిన 3 కుటుంబాలను ప్రభుత్వం ఆ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ గురువారం కార్యాలయంలో జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా వినతి పత్రంలో పత్తి చేనులో పనిచేస్తు పిడుగుపడి మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అంతేకాక ఆ కుటుంబాలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకోపోవాలన్నారు. అతి పేదరికం అనుభవిస్తూ కూలీ చేసుకొని జీవనం సాగిస్తున్న వారి జీవితాల్లో చీకటి అలుముకుందని పిడుగుపడి మృతిచెందిన 3కుటుంబాలను ఆదుకునేందుకు కూడా తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు మరియు ప్రభుత్వం స్పందించాలని వినతి పత్రంలో ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కలెక్టర్ అత్యవసర నిధి కింద బాధిత కుటుంబాలకు తక్షణం ఆర్థిక సాయం అందించాలని వినతి పత్రంలో సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ కోరారు. ఈ విషయం పై అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ తప్పకుండా బాధిత కుటుంబాలకు సహాయం అందించి ప్రభుత్వ పరంగా ఆ కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు డాక్టర్ ప్రేమ్ కుమార్ తెలిపారు.

## అరుణమ్మ కృషితో అందరి కల సాకారం

**కృష్ణ రైల్వే స్టేషన్‌లో మూడు రైళ్ల స్టాప్ ప్రారంభం**

**ప్రధాని నరేంద్ర మోడీ ఎంపి డీకే అరుణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసిన బిజెపి నాయకులు**



ఎంపి డికె అరుణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**కృష్ణ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** కృష్ణ రైల్వే స్టేషన్‌లో కరోనా సమయంలో రద్దు చేసిన మూడు రైళ్ల స్టాప్ లను రైల్వే అధికారులు పున: ప్రారంభించారు. పాలమూరు ఎంపి డి కే అరుణ కృషితో ప్రయాణికుల అందరి కల సాకారం అయిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2019 నుంచి కృష్ణ రైల్వే స్టేషన్‌లో అప్పట్ వరకు స్టాప్ ఉన్న 11014 కోయంబత్తూర్ లోకమాన్య తిలక్ రైలు, 22159 ముంబై ,చెన్నై రైలు, 22160 చెన్నై ముంబై రైళ్ళ స్టాప్‌లను రైల్వే అధికారులు రద్దు చేశారు. దాంతో ఈ ప్రాంత ప్రజలు ఆయా రూట్లలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైళ్ళ స్టాప్‌లను పునరుద్ధరించాలని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు అమర్ కుమార్ దీక్షిత్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు అనేక ఆందోళన కార్యక్రమాలు కేంద్ర మంత్రులకు అధికారులకు వినతులు సమర్పించారు. అయినా ఫలితం లేకపోగా.. పాలమూరు ఎంపిగా డి కే.అరుణ గెలుపొందాక బిజెపి నాయకులు వినతి పత్రం రూపంలో సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎంపి. డికె అరుణ రైల్వే మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి రద్దు అయిన రైళ్ల స్టాప్ లను పునరుద్ధరింప చేయడానికి కృషి చేశారు. ఆమె కృషి ఫలితమే ఈరోజు రద్దయిన రైల్వే స్టాప్‌లు మళ్లీ ప్రారంభమయ్యాయని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు అమర్ కుమార్ దీక్షిత్ అన్నారు. గురువారం కృష్ణ రైల్వే స్టేషన్ లో బిజెపి ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లె నరసప్ప ఆధ్వర్యంలో బిజెపి నాయకులు సంబరాలు జరుపుకుంటూ ప్రధాని నరేంద్ర మోడీ, ఎంపి డికె.అరుణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జెనరల్ మేనేజర్‌కు ధన్యవాద తీర్మానం కాపీ స్టేషన్ మాస్టరుకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అమరకుమార్ దీక్షిత్, బిజెపి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్లే నరసప్ప, జిల్లా నాయకులు బలరాం రెడ్డి, మాజీ అధ్యక్షులు జయనంద్ రెడ్డి, మాజీ నియోజకవర్గం కన్వీనర్ కర్నే స్వామి మాజీ వైస్ ఎంపీపీ ఆర్ వెంకటేష్, జిల్లా నాయకులు వాకిటి మల్లేష్, ప్రధాన కార్యదర్శులు డి.రాఘవేంద్ర, కె.తిమ్మప్ప, మక్తల్ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, మాజీ ఎంపీటీసీ కొంకల్ వెంకటేష్, మాజీ సర్పంచ్ మహాదేవప్ప, బిఆర్‌ఎస్ నాయకులు బర్మాన్నోళ్ల సురేష్, శంకర్ నాయక్, మల్లారెడ్డి గౌడ, డీకే కిష్టప్ప, బి. శంక్రప్ప, లక్ష్మి సింగ్, లోకపల్లి హన్మంతు, శంకరయ్య శెట్టి, మండల్ నాయకులు గంప వెంకటప్ప, కుసుమర్తి మల్రెప్ప ఆంజప్ప గౌడ్, తిమ్మప్ప, వర్కూర్ ఉషానోళ్ల వెంకటప్ప, శ్రీను, కేశవరెడ్డి, ఐనపూర్ బస్వరాజ్, మంజునాథ్ స్వామి, నర్సింహా, ఉమ్మడి మండలం అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ డిగ్రీ ప్రవేశాల దరఖాస్తుల గడువు పొడిగింపు

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2025,2026 విద్యా సంవత్సరానికి డిగ్రీలో బిఎ,బికాం,బిఎస్‌సి కోర్సులలో దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్12వ తేదివరకు పొడిగించినట్లు ఎన్టీ ఆర్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.వి. రాజేంద్రప్రసాద్ తెలి యజేశారు. అలాగే ద్వితీయ,తృతీయ సంవత్సరం చదువు తున్న విద్యార్థులు రిజిస్ట్రేషన్‌ఫీజును ఈనెల12తేదిలోగా ఆన్‌లైన్లో చె ల్లించాలని తెలియ జేశారు. మరింత సమాచారం కోసం వెబ్ సై ట్లో సందర్శించాలని, మరిన్ని వివరాల కొరకు చర వాణి నెంబరు 7382929757 కు సంప్రదించాలని కళాశాల సమన్వయ కర్త డా. సి.హెచ్. కిషోర్ కుమార్ తెలియజేశారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## లైన్మెన్‌ను ఏర్పాటు చేయండి

**అలంపూర్ సెప్టెంబర్11, ప్రభాతవార్త :** మానవపాడు మండల కేంద్రంలో కరెంట్ లైన్మెన్ లేని కారణంగా ఉన్న లైన్మెన్‌కి మానవపాడు ఇన్చార్జిగా మారమునగాల గ్రామాలు రెండు ఉండటం వలన మానవపాడు గ్రామంలో విద్యుత్ అంతరాయంలో ఓల్టేజ్ సమస్య గురించి మానవపాడు మండల విద్యుత్తు ఏ.ఈ.ని అలంపూర్ ఏ.డి.ఈ.ని కలవడం జరిగిందని అ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. పదేపదేలో ఓల్టేజ్ సమస్య వలన కరెంటు పోయి ఫ్రిజ్లు ఫ్యాన్లు టీవీలు కాలిపోతున్నాని తెలిపారు. మానవపాడు గ్రామానికి పర్మినెంట్ లైన్మెన్ను ఇచ్చి ఇట్టి సమస్యలను తొందరగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఇసుక లారీ పట్టివేత

**ఇటిక్యాల సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని 44 నెంబర్ జాతీయ రహదారి ఇటిక్యాల స్టేజి వద్ద అక్రమంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో తుంగభద్ర నది నుండి హైదరాబాద్ వైపు అక్రమంగా అనుమతులు లేకుండా టీ. జి. 06 టీ. 1179 నంబర్ గల లారీలో ఇసుకను తరలిస్తుండగా ఇటిక్యాల స్టేజి వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

## ఫోటో ఎక్స్‌పో గోడ పత్రిక విడుదల

**ఉప్పునుంతల, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** ఫోటో,వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటో ఎక్స్ పో 2025 గోడ పత్రికను ఎస్‌ఐ వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గురువారం ఫోటో ఎక్స్‌పో 2025 ఈనెల 19,20,21న నర్సింగి హైదరాబాద్‌లో జరుగు విజయవంతం చేయాలని తాలూకా అధ్యక్షుడు తాటికొండ గిరి, ప్రధాన కార్యదర్శి సురివి కృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు బొల్లు శివకుమార్, బరిగేల ఆనంద్, శ్రీను, కేశవులు, సాజిద్, మల్లేష్, రాజు,రాము తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గొర్రెల మృతి

**గండీడ్ సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** ప్రమాదాలకు నిలయంగా మారిన విద్యుత్ ట్రాన్స్ఫర్మర్లకు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన సింగల్ ఫేస్ బుడ్లకు కంచెలను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గండేడ్ మండలం పగిడియాల్ గ్రామంలోని యుపిఎస్ పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ బుడ్ల కు కంచి లేకపోవడంతో గురువారం అటుగా మేతకు వెళ్ళిన గొర్రెలకు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో గొర్రెలు మృతి చెందాయి. ఈ బుడ్ల వల్ల పాఠశాల విద్యార్థులకు, మూగజీవులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ బుడ్లకు కంచెను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

## పిడుగుపాటుకు గురైన ముగ్గురి కుటుంబాలకు సహాయం అందజేత


**అలంపూర్ సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ చొరువ తో ప్రభుత్వం తరఫున భరోసా కల్పించడానికి ఆర్డిఓ ని, ఎమ్మార్వో ని,చనిపోయిన కుటుంబాల దగ్గరకు వెళ్లి చనిపోయిన ప్రతి కుటుంబానికి 6 లక్షల రూపాయలు ఎక్స్రేషియా మరియు ఇందిరమ్మ ఇల్లును ఇస్తూ వారి పిల్లలు చదువుకోవడానికి కస్తూర్బా గాంధీ స్కూల్ గాని గురుకుల పాఠశాలలో చదువుకోవడానికి అవకాశాన్ని కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి,అల్లంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప,వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్,మండల పార్టీ అధ్యక్షుడు ఉత్తనూరు జయన్న,దేవేందర్,పాండురంగ, మొదలగు వారు పాల్గొని పూలమాలవేసి నివాళి అర్పించడం జరిగింది.

## ఉచిత ఆరోగ్య శిబిరం

**ఊట్కూర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల కేంద్రంలో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం జరిగింది. రోగులకు సాధారణ పరీక్షలు చేసి మందులు, టానిక్స్ అందజేశారు. డా. పృథ్వి ప్రజలు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త శాంసన్ మాట్లాడుతూ ప్రతి నెల ఉచిత శిబిరాలు నిర్వహించి పేదలు, మహిళలు, వృద్ధులకు వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 180 మందికి సేవలు అందించారు. కార్యక్రమంలో హాజమ్మ, నర్సింలు, హారిక, కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తలు, శక్తి ఫౌండేషన్ అధ్యక్షులు శివ ప్రసాద్ రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు శంకర్, హన్మంతు, తిమ్మప్ప, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు అన్యాయం చేయొద్దు

**బిఆర్‌ఎస్‌వి ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మ దహనం**




నిరసన తెలుపుతున్న బిఆర్‌ఎస్‌వి నాయకులు

**జడ్చర్ల, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** గ్రూప్1 పోస్టులను అమ్ముకొని కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ జడ్చర్లలో టీఆర్‌ఎస్వీ నాయకులు నిరసన తెలిపారు. జడ్చర్ల బిఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. నిరుద్యోగ యువతకు అన్యాయం చేయొద్దని పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



11ఎంబిఎన్‌ఆర్ 26: విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న దృశ్యం

## గురువు కోసం విద్యార్థిగా మారిన ఆంగ్ల ఉపాధ్యాయుడు

**నారాయణపేట, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** నారాయణపేట మండల పరిధిలోని కొల్లంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో గురువు విద్యార్థి అనుబంధానికి మధుర క్షణం చోటుచేసుకుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద జట్రంలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన రవికుమార్ వద్ద గోపాల్ అనే విద్యార్థి తొమ్మిదో తరగతి చదివాడు. కాలక్రమంలో అదే గోపాల్ ఎస్జీటీ ఉద్యోగంలో చేరి అనంతరం జరిగిన ప్రమోషన్లలో కొల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడిగా నియమితుడయ్యాడు. ఆంగ్ల సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశం నిమిత్తం గోపాల్ కొల్లంపల్లి పాఠశాలకు వచ్చాడు. విరామ సమయంలో తన చిన్ననాటి గురువు రవికుమార్ తరగతి విద్యార్థులతో కలిసి విని మళ్లీ విద్యార్థిగా మారిపోయాడు. అనంతరం తన అనుభవాలను పంచుకుంటూ గురువు బోధనతో తనకు కలిగిన ప్రేరణను గుర్తు చేసుకున్నాడు. తన పాత విద్యార్థి గోపాల్ క్లాస్‌లో మళ్లీ కనిపించడంతో రవికుమార్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సంఘటన గురువు విద్యార్థి బంధం ఎంత శాశ్వతమో మరోసారి నిరూపించింది.

## కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి

**అలంపూర్ సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** అలంపూర్ మండలంలో సిఐటియు మండల మూడవ మహాసభ మండల నాయకుడు లక్ష్మణ అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వి.వి నరసింహ హాజరై మాట్లాడుతూ కార్మిక వర్గానికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఉన్న దాని అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఉద్యోగ భద్రత పెన్షన్ రిటర్మెంట్ ఇవ్వడంలో అలాగే పారిశుద్ధ కార్మికులను పర్మినెంట్ చేసి వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం కట్టు బానిసలు చేసే విధంగా కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడలుగా తీసుకొచ్చిందని దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. అలాగే అల్లంపూర్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలల పెండింగ్ జీతాలు తక్షణమే ఇచ్చి కేటగిరి వారిగా జీతాలు చెల్లించాలని పిఎఫ్, ఈఎస్ఐ,సౌకర్యం సక్రమంగా అమలు చేసి సబ్బులు,బట్టలు,నూనెలు,చెప్పులు తదితర పరికరాలు ఇవ్వాలని అమలుచేయాలని మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎమ్మెలమ్మ, సిఐటియు మండల నాయకులు నాగేశ్వరమ్మ, శారద, రాధా,లక్ష్మన్న, లక్ష్మీ ్మ నారాయణ, ఏసేపు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్1 పరీక్షల అవకతవకలపై బీఆర్ఎస్వి నిరసన




నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్వి నాయకులు

**నారాయణపేట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగాబీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ గ్రూప్1 పరీక్షల నిర్వహణలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టిజీపీఎస్సీ విఫలమైందని,నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్, కమిషన్ అధికారులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే గ్రూప్ 1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కఠిన చర్యలు తీసుకోవాలని జీవో నెం.29ను రద్దు చేసి,జీవో నెం.55ను అమలు చేయాలని ఇప్పటికే నిర్వహించిన గ్రూప్1 పరీక్షను రద్దు చేసి తక్షణమే కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని హైకోర్టు సూచనల మేరకు అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి సమగ్రవిచారణ జరపాలని డిమాండ్ చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిజీపీఎస్సీ చైర్మన్ సంబంధిత అధికారులు బాధ్యత వహించి రాజీనామా చేయాలని లేకుంటే ప్రభుత్వంపై యుద్ధం చేయక తప్పదని హెచ్చరించారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్వీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శివరాజ్ రెడ్డి, కోలునరేష్, బాలు, శ్రీను, బాబు, సాయికృష్ణ, వినయ్ రెడ్డి, అనిల్, శ్రావణ్, ఇర్ఫాన్ కుర్వ నవీన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**మక్తల్ టౌన్, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** మక్తల్ సర్కిల్ పరిధిలో చాలా కాలంగా కోర్టులో పెండిగ్‌లో వున్న కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ సీఐ రామ్ లాల్ ఒక ప్రకటనలో ప్రజలకు తెలిపారు. సెప్టెంబర్ 13వ తేదిన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో నారాయణపేట కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడును. ఈ లోక్ అదాలత్ ద్వారా చట్టరీత్యా రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులతో పాటురాజీపడదగిన సివిల్ కేసులు, భూ వివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు, చిట్‌ఫండ్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, వైవాహిక కేసులు, తగాదాలు, అన్ని రకాల ట్రాఫిక్ కేసులకు సంబంధించి జాతీయ లోక్ అదాలత్‌నందు ఇరువర్గాల కక్షీదారులు అంగీకారయోగ్యమైన సత్వర పరిష్కారం ఈ లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని. ఇరువర్గాల కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోని సమస్యలను పరిష్కరించుకోవాలని మరిన్ని వివరాలను లోకల్ పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాల్సిందిగా సిఐ తెలిపారు.

## వాకిటి శ్రీహరి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ



ఉచిత అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఊట్కూర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర వాకిటి శ్రీహరి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇటీవల ఈ సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా, దాదాపు 25మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించి, పూర్తిగా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించడం జరిగింది. చికిత్స అనంతరం కోలుకున్న రోగులకు ఉట్కూర్ మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఉచితంగా కంటి అద్దాలు, అవసరమైన మందులు, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు.ఈ సేవా కార్యక్రమంరాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో సాధ్యమైందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి శ్రీహరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు పేద ప్రజలకు వరప్రసాదంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్న వాకిటి శ్రీహరి సేవా సమితికి తాను పూర్తి సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకులు ఏ.రవికుమార్, సభ్యులు నూరుద్దీన్,అసముద్దీన్, బోయ నరసింహ, లయన్స్ ఆసుపత్రి సిబ్బంది సత్యంగౌడ్, ఖాజాద్దీన్, అలాగే ఉట్కూర్ మండల నాయకులు విగ్నేశ్వర్ రెడ్డి, కొక్కులింగం, మహేశ్వర్ రెడ్డి, జగదీష్ గౌడ్, రఘు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొకురాల స్వర్ణలతకు డాక్టరేట్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 11 ప్రభాత వార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన మొకురాల రామేశ్వర శర్మ, సరోజ దంపతుల చిన్న కుమార్తె స్వర్ణలత డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా స్వర్ణలత పనిచేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పెబ్బేరుకు చెందిన ప్రముఖ కథా రచయిత వల్లపురెడ్డి బుచ్చారెడ్డి సాహిత్యంపై చేసిన పరిశోధనకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎన్.రజనీ పర్యవేక్షణలో వల్లపురెడ్డి బుచ్చారెడ్డి జీవితం, సాహిత్యం అనే అంశంపై స్వర్ణలత పరిశోధన జరిపారు. త్వరలో జరగనున్న స్నాతకోత్సవంలో గవర్నర్ చేతులమీదుగా స్వర్ణలత డాక్టరేట్ పట్టా అందుకోనున్నారు.



డాక్టరేట్ తీసుకుంటున్న స్వర్ణలత

# వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలకు గొప్ప చరిత్ర ఉంది

◆ ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి ◆ బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** వనపర్తి గురించి చెప్పగానే ముందుగా గుర్తుకువచ్చేది పాలిటెక్నిక్ కళాశాల అని.. దేశ మొట్ట మొదటి ప్రధానమంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించినటువంటి గొప్ప చరిత్ర పాలిటెక్నిక్ కళాశాలకు ఉందని అలాంటి పాలిటెక్నిక్ కళాశాల ముందు కళాశాలకు చెందిన బారికేడ్లను ధ్వంసం చేస్తే పట్టించుకునేవారే లేరా? ఎక్కడపోతుంది సమాజమని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. గురువారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ముందు ధ్వంసమైన ప్రభుత్వ ఆస్తిని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వినాయక చవితికి ముందు పోలీసులు తమ పర్మిషన్ తీసుకొని విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని అనేక వేదికల ద్వారా చెప్పారన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ముందు వినాయకుడిని ఏర్పాటు చేశారు. కాని పెద్ద వాహనాలు వస్తే లోపలికి వెళ్లకుండా కళాశాల యాజమాన్యం బారికేడ్ల మాదిరిగా చిన్న చిన్న రాడ్లను ఏర్పాటు చేశారని, వినాయకుడిని ఏర్పాటు చేసిన తర్వాత నిర్వాహకులు అక్కడున్న ఆరాడ్లను ధ్వంసం చేశారన్నారు. వారికి వినాయకుడిని ఏర్పాటు చేయడానికి పోలీసులు కాని, మున్సిపల్ శాఖ కాని పర్మిషన్ ఇచ్చిందా? ఈరోజు ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే ప్రభుత్వం యంత్రాంగం,పోలీసుశాఖ, మున్సిపల్ శాఖలు చూస్తూ ఎలా ఉన్నాయి?బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదు? గతంలో ఓ రైతు గురించి పెబ్బేరులో పోరాటం చేయడానికి వెళ్తే మీ పోలీసులు నాపై కేసు నమోదు చేశారు. మరీ ఇక్కడ ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే మీరేంచేస్తున్నారు? ప్రజాస్వామ్యం ఎటుపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కళాశాల ముందు చెత్త వేయరాదు అని పెద్ద బోర్డు పెట్టారు. ఇక్కడ ప్రభుత్వ ఆస్తి ధ్వంసం అయితే మున్సిపల్ అధికారులు ఎక్కడున్నారు? కమిషనర్ ఏం చేస్తున్నట్లు? ధ్వంసం చేసిన దొంగలకు వత్తాసు పలుకుతున్నరా? వెంటనే దీని కారకులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. తక్షణమే అక్కడ బారికేడ్లను ఏర్పాటు చేయాలని బీసీపొలిటికల్ జేఏసీతరఫున డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌ను కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తులజితేందర్, శ్రీరంగపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్,నాగరాజు, నరేందర్ సాగర్, యశ్వంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న రాచాల



ధ్వంసం అయిన ప్రాంతాన్ని మీడియాకు చూపెడుతున్న రాచాల బృందం

# భూ నిర్వాసితులకు పరిహారం అందే వరకు పోరాటం ఆగదు

■ భూ నిర్వాసితుల సంఘం నాయకులు కుంటి పాప ఆంజనేయులు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారము అందే వరకు పోరాటం కొనసాగుతుందని ఆ సంఘం జిల్లా నాయకులు కుంటిపాప ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర జరుగుతున్న రిలే దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రిలే దీక్షలు ప్రారంభించి 59రోజులు గడుస్తున్న ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుండా కాలయాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు.భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు ఎకరంకు 35లక్షల రూపాయల చొప్పున పరిహారం అందివ్వాలని,ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం పూనుకుంటే ప్రతిఘటన తప్పదనిహెచ్చరించారు. మోసపూరితంగా,బలవంతంగాభూసేకరణకు ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా బేసిక్ ధర నిర్ణయించి 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలన్నారు.మాకు హక్కుగా రావలసిన న్యాయమైన పర్యారాన్ని అంది ఇవ్వాలని డిమాండ్ చేశారు .పరిహారం పై స్పష్టమైన ప్రకటన చేయకుండా ప్రాజెక్టు సంబంధించిన ఎలాంటి పనులు చేయకూడదని డిమాండ్ చేశారు.ఈ రిలే దీక్షలలో భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు మచ్చేందర్ భూ నిర్వాసితుల సంఘం పెరపల్ల గ్రామనాయకులు నరసింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొనసాగుతున్న భూ నిర్వాసితుల దీక్షలు

# మృతుల కుటుంబాలను పరామర్శించిన రాజకీయ నాయకులు

**అయిజ సెప్టెంబర్11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని భూం పురం గ్రామంలో బుధవారం కురిసిన వర్షంలో పిడుగుపాటు గురై ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన జరిగిన విషయం తెలిసిందే, ఇందులో భాగంగా గురువారం పలువురు రాజకీయ నాయకులు మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా అలంపూర్ మాజీఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆదేశాల మేరకు అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి జిల్లా ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను పరామర్శింరు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 6 లక్షల రూపాయలు పారితోషికం అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. అలాగే కుటుంబంలో వైద్య విద్యా సదుపాయాలు ప్రభుత్వం తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయి ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.




డాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

# శనగ విత్తనాలను ప్రతి రైతుకు అందించాలి

**అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు**

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** శనగ విత్తనాలను అవసరమున్న రైతులందరికీ అందించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఏఐయుకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి,జిల్లా మండల అధ్యక్షుడు తాయప్ప తో బాటు పలువురు రైతులు గురువారం జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట జిల్లా,దామరగిద్ద మండలలోని వ్యవసాయానికి సంబంధించిన ఏ సమాచారం ప్రజల దగ్గరికి చేర్చడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. యూరియా ,విత్తనాలు వస్తున్న విషయం రాజకీయ నేతలకు తప్ప ప్రజలకు తెలియడం లేదన్నారు.3నెలల క్రితం కంది విత్తనాలు సమాచారం కూడా విస్తృతంగా రైతులకుతెలవలేదన్నారు. సమాచారం ఉన్న వాళ్ల మాత్రమే తెచ్చుకోవడం అనేది జరిగింది. అవి కూడా రైతులు కంది పంటను వేసిన రెండు నెలలకు పంపిణీ చేయడం అనేది సరైనది కాదు. సకలములో విత్తనాలు రైతులకు అందిస్తే మేలు జరుగుతుందని అన్నారు.దామరగిద్ద మండలానికి ఒక ఎన్జీవో సంస్థ పల్లి విత్తనాలను ఉచితంగా సరఫరా చేస్తాను అని లిస్టు పంపండి అని వ్యవసాయ అధికారులని కోరిన ఏదో ఊరికి ఒకరికి చెప్పిలిస్టు రాసి పంపించడంఅనేది కూడా సరైనది కాదన్నారు. చిన్న సన్న కారు రైతులది ఒక్క పేరు కూడా లేదన్నారు. అసలువిషయమే వాళ్లకు తెలవదు ఇలాంటి ఘటనలు దామరగిద్ద మండలంలో చాలా చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ వ్యవసాయ అధికారులు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చిన విత్తనాలు, ఎరువులు సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు వెంకటేష్, మధు, మల్లేష్ తదితరులు ఉన్నారు.



జిల్లా అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా కార్యక్రమాలు

**బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజారెడ్డి వెల్లడి**

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవం, భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మ దినాన్ని పురస్కరించుకొని బూత్ స్థాయిలో అక్టోబర్ 2 వరకు సేవ కార్య క్రమాలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజారెడ్డి సూచించారు. సేవా పక్షం జిల్లాస్థాయి కార్యశాల కన్వీనర్ కొత్తకోట కిరణ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన గురువారం బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథులుగా జాతీయ కౌన్సిల్ సభ్యురాలు జి.పద్మజ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తల కృషి వల్లే దేశంలో అధికారంలో ఉన్నామని,మనం చేసే పనివల్లె గుర్తింపు వస్తుందన్నారు. దేశం కోసం ధర్మంకోసంమనం పనిచేయాలని కొనియాడారు. కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగిలి రమేష్‌కుమార్, సేవ పక్షం జిల్లా కోకన్వీనర్ రాజుగౌడ,గట్టుమల్లేష్, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితిరెడ్డి,యువమోర్చజిల్లాఅధ్యక్షులు తిరుపతి, బొంగు గంగన్న, దోమలక్ష్మీ ్మనారాయణ, కే.సతీష్‌కుమార్



మాట్లాడుతున్న పద్మజారెడ్డి

## ఎమ్మెల్యేను సన్మానించిన గిరిజన నాయకులు

**బిజినేపల్లి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** గిరిజన తండాలకు బీటీ రోడ్ల కు నిధులు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ గిరిజన నాయకులు ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డిని సన్మానించారు. గౌరారం దన్‌సింగ్ తండా, చిన్నపీరు, కల్వకుంట, మాన్య నాయక్, ఫైన్‌పల్లి తార్‌సింగ్ తండా, వసురం తండా రోడ్లకు నిధులు మంజూరు చేయటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా గిరిజన తండాల్లోని ప్రజలు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం రహదారులు లేని గిరిజన తండాలకు ప్రభుత్వం బీటీ రోడ్లు మంజూరు చేయటం పట్ల గిరిజనతండాల ప్రజలు ఎమ్మెల్సీ కూచుకుల్లదామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేరాజేష్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు. నిరంతరం గిరిజన తండాల అభివృద్ధి కోసం శ్రమిస్తున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటనున్నట్లు తెలిపారు ఎమ్మెల్యేను కలిసిన వారిలో కేతావత్ మాన్యనాయక్, హన్మ్యానాయక్, మొల్గర మహేందర్, ధర్మ నాయక్ తదితరులున్నారు.



## ఘనంగా బండి వేణు జన్మదిన వేడుకలు

**నారాయణపేటటౌన్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ జన్మదిన వేడుకలు గురువారం నారాయణపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు బండి వేణు గోపాల్‌తో కేక్ కట్ చేయించి శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్‌కుమార్, పెరపళ్ళ, జాజాపుర్, నారాయణపేట పట్టణ యువజన కాంగ్రెస్ నాయకులు 14వ వార్డు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా మొరం ఇసుక తరలింపు

**మూడు వాహనాల పట్టివేత**

**నారాయణపేట, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మొరం ఇసుక తరలింపు జరుగుతుందనే సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ కోస్గి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు అర్ధరాత్రి జరిగిన ఈ ఆపరేషన్‌లో రెండు టిప్పర్లు ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. మొరం తరలిస్తున్న టిప్పర్లు డ్రైవర్లు టి.వంశి, శ్రావణ్ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మధు రెడ్డిని పట్టుకొని కోస్గి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరి మీద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కోస్గి ఎస్సై బాలరాజు, ఆంజనేయులు తెలిపారు. అలాగే కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక,మొరం తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఐయంఎ నూతన కార్యవర్గం ఎన్నిక

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** నారాయపేట జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఐయంఎ సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులు డా. వైమల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి డా.ఆదిత్యగౌడ్, కోశాధికారి డాక్టర్ గీతవిశ్వనాథ్, ఉపాధ్యక్షులు డా.కార్తీక్‌గందె, సహకార్యదర్శి డా.అక్షితఎంపికయ్యారు, అనంతరం వారు మాట్లాడుతు తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా తమను ఎన్నుకున్నందుకు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## చలో దోస్త్ చెస్ ఆడదాం..

**పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం**



చెస్ బోర్డులు అందజేస్తున్న ఎన్ఆర్ఐ ఫోరం సభ్యులు

**ధన్వాడ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** ధన్వాడ మండల పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 203 చదరంగం బోర్డులతో పాటు చెస్ పుస్తకాలు కూడా పంపిణీ చేయడం జరిగింది. పాలమూరు ఎన్నారై ఫోరం కోఆర్డినేటర్ మహి పాల్‌రెడ్డి, మాట్లాడుతూ పాలమూరు ఎన్నారై ఫోరం చెస్ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలో తీసుకోవాలని యూత్, విద్యార్థుల ఎక్కువ సంఖ్యలో మొబైల్ ఫోన్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు కాబట్టి ఇలాంటి టైంలో ఒక గేమ్ ఉంటే ఎలా ఉంటుందని ఆలోచన దృక్పథంతో మొదలైన ఈ గేమ్ చేస్,ఆట విద్యార్థులకు ఆలోచన దృక్పథం పెంచుతుంది, ఎలా విజయం సాధించి దిశగా చెస్ ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఏదైనా ఆటలు ఆడేటప్పుడు ఉదాహరణకు ఒక క్రికెట్ తీసుకుందాం ఈ ఆటలో 11మంది ఆడతారు కానీ ఎవరో ఒకరు మంచిగా ఆడకపోయినా గెలవలేక పోతారు. కానీ ఈ చదరంగం ఆటలో గెలిచిన ఓడిన ఒక్కరే ఆడుతారు. అంటే తప్పు ఎవరు చేశారు అన్నది తెలిసిపోతుంది.ఎందుకుఓడిపోయానుఅనే కారణం తెలుసుకుంటాం ఇప్పుడు ముందుకు వెళ్లడానికి ఈ గేమ్ ఉపయోగ పడుతుంది. పాలమూరు ఎన్నారై ఫోరం సభ్యులు రవి మీరెడ్డి, చెస్ నెట్వర్క్ టీంసుధీర్, సంజయ్,హరిరాజ్, రాజన్న, చదరంగం బోర్డులను స్పాన్సర్స్ శివారెడ్డి ఈ కార్యక్రమంలో పాలమూరు ఎన్నారై ఫోరం కన్వీనర్ మహిపాల్‌రెడ్డి మండల విద్యాధికారి గాయత్రి. బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్,నరసింహ చారి ఉపాధ్యాయులు,కేజీబీవీ ఎస్ఓ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ




విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ చేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణ్ పేట్ వారి ఆధ్వర్యంలో గురువారం మక్తల్,మాగనూరు ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ భట్టడ్ మాట్లాడుతూ జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే 5000మంది విద్యార్థులకు 19 వేల నోట్ బుక్స్‌ను అందించామని అన్నారు.భావితరాలకు మార్గ దర్శకులు విద్యార్థులని కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరి పేట జిల్లాతోపాటు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులను తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్, పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్, కోశాధికారి రాధ సదానంద్ చారి, ఆత్మ రాం, ఏడికే బీం చందర్‌గౌడ్, కృష్ణమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## గ్రంథాలయ పన్ను బకాయిలను త్వరగా చెల్లించాలి

**గద్వాల టౌన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** జిల్లాలో గ్రంథాలయ పన్ను బకాయిలను త్వరగా చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు.గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు గ్రంథాలయ పన్ను వసూలుపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ జోగులాంబ గద్వాల జిల్లాకు గ్రంథాలయ పన్ను, 8 శాతం (ఆస్తి పన్నుపై) వివిధ గ్రామపంచాయతీల నుంచి, మున్సిపాలిటీల నుంచి రావాల్సిన గ్రంథాలయ పన్ను బకాయిలను త్వరగా చెల్లించాలని మున్సిపాలిటీ కమిషనర్లకు, జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,జిల్లా ఆడిట్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ,మున్సిపాలిటీ కమిషనర్లు,కార్యదర్శి జిల్లా గ్రంథాలయ సంస్థ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగ రావు





నీళ్లతో నిండిపోయిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వెళ్లే దారి.. వచ్చే దారి

## అధ్వానంగా పెబ్బేరు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం

◆ గుంతలలో బస్సు నడపలేకపోతున్న ఆర్టీసీ డ్రైవర్లు

**పెబ్బేరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలోని ఆర్టిసి ప్రయాణ ప్రాంగణం గుంతల మయంగా మారిపోయిందని నిత్యం వేల మంది ప్రయాణించే ప్రయాణికులతో నిండిపోయి ఉంటుందని అలాంటి ప్రయాణ ప్రాంగణంలో వర్షాకాలం వచ్చిందంటే బస్టాండ్ లోపలికి పోవాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెబ్బేరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి నిత్యం కర్నూలు, తిరుపతి, మహబూబ్‌నగర్, షాద్ నగర్, జడ్చర్ల, హైదరాబాద్, కల్వకుర్తి, అచ్చంపేట, శ్రీశైలం నిత్యం బస్సులు వెళుతూ ప్రయాణికులతో నిండిపోయి ఉంటుంది. కానీ ఆర్టీసీ సంస్థ వారు కనీస వసతులు కల్పించలేక బస్టాండ్ మొత్తం గుంతల మయంగా వర్షాకాలం వస్తే నీళ్లు చేరుకొని కనీసం ప్రయాణికులు నడవడానికి కూడా ఇబ్బందికరంగా ఉందని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పెబ్బేరు ఆర్టీసీ బస్టాండ్లను పట్టించుకునే నాథుడే లేరని ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ రోడ్డు వేసి, కనీస సౌకర్యాలు కల్పించాలని, త్రాగడానికి మంచినీరు కల్పించాలని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఆర్టిసి ప్రాంగణంలో షాప్స్‌లో అమ్మే తినే వస్తువులు ఏది కూడా ఐఎస్ఐ మార్కు లేకుండా లోకల్ బ్రాండ్లో అమ్ముతున్నారని వాటిపై ఉండే ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్ముతున్న అధికారులు ఎవరూ కూడా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు నిఘ ఉంచాలని లేనిచో ఆ బిస్కెట్లు, కురు కురేలు తిని, పిల్లలకు ప్రమాదాలకు గురయ్యే ఛాన్స్ ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.





నీళ్లతో నిండిపోయిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వెళ్లే దారి.. వచ్చే దారి

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు

■ఎస్సై రామ్‌లాల్ నాయక్

**చిన్నచింతకుంట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** మండలంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై రామ్‌లాల్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి 9 గం.ల ప్రాంతంలో మండల కేంద్రానికి చెందిన కుమ్మరి ప్రవీణ్ కుమార్ తన స్నేహితుడు అక్కల అర్జున్‌గౌడ్‌లు కలిసి బైక్ పై వెళ్తుండగా చర్చి దగ్గర ఎస్సీ కాలనీకి చంద్రన్న అలియాస్ చంద్రి అనే యువకుడు వారిని అడ్డగించి చేతులతో కొట్టి కింద పడవేసి బూతు మాటలు తిట్టారని ఆయన తెలిపారు. వినాయక చవితి రోజు రోడ్డుపై మైక్ సౌండ్ ఎక్కువ పెట్టినావని బెదిరించాడని ఫిర్యాదు ఇవ్వగా చంద్రన్న పై పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి తహసిల్దార్ ముందు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యగా ఆరు నెలల కాలంలో భవిష్యత్తులోనేరాలకు పాల్పడితే లక్షయాభైవేలు జరిమానా విధించి బైండోవర్ చేస్తామని ఆయన తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపట్ల కుల మతాల మధ్య వైశ్యమ్యాలను పెంచేవారి పట్ల ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని చట్టపరంగా చర్యలు తీసుకొనుటకు వెనకాడది లేదని ఎస్సై హెచ్చరించారు.

## నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

సారించాలన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించి తెలియజేయాలన్నారు. అన్ని మున్సిపాలిటీలో గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు వారానికి ఒకసారి లేదా పది రోజులకు ఒకసారి శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్యాంకులకు సంబంధించి క్లీనింగ్ రిజిస్టర్ మైంటైన్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎంపీడీవోలు అందరూ తమ పరిధిలోని సంక్షేమగురుకుల విద్యాసంస్థలనుఆకస్మికంగా తనిఖీలు చేయాలని, అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే వాటిని దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా విద్యా సంస్థల్లో నీరు నిల్వ ఉండే ఆస్కారం లేకుండా, అదేవిధంగా పిచ్చి గడ్డిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఆర్డిఓ ఉమాదేవి, హౌసింగ్ డిఈ విఠోబా, డిడబ్ల్యుఓ సుధారాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

## వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని తనిఖీ చేసిన జోగులాంబ జోన్ 7 డిఐజి ఎల్.ఎస్. చౌహాన్

**వనపర్తి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా వనపర్తి పోలీసుకార్యాలయాన్ని జోగులాంబ జోన్ 7 డిఐజి ఎల్.ఎస్.చౌహాన్ తనిఖీ చేసి కార్యాలయం పరిసరాలను పరిశీలించారు. ముందుగా వనపర్తి జిల్లా ఎస్పీ రావులగిరిధర్ డిఐజికి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ విభాగాలు అయిన ఎస్‌బి, డిసిఆర్‌బి రికార్డులను, ఎంటి ఎ సెక్షన్, బి సెక్షన్ విభాగాల రికార్డులను, హెడ్ క్వార్టర్స్ కు సంభందించిన ప్లాటూన్ రికార్డ్స్, అడ్మిన్ స్టోరీ రికార్డ్స్, బెల్ ఆఫ్ ఆర్మ్స్ (ఆయుధాల) రికార్డ్‌లను, ఎంటి సెక్షన్ రికార్డ్స్, హోంగార్డ్స్ రిజిష్టర్‌లను డాగ్ స్క్వాడ్‌రికార్డులను రిజిస్టర్‌లను పరిశీలించి రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. ఈ సంధర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో విభాగాల సిబ్బంది పని తీరును జిల్లా ఎస్పీ డిఐజి కి వివరించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సర్వీస్‌కు సంబందించి వచ్చే విన్నపాల ఉన్నతాధికారుల ఆదేశాల పై ఎప్పటికపుడు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించే దిశగా సిబ్బందిని కేటాయించి పరిష్కరించాలని సూచించారు. విపిఓ విధానాన్ని తప్పకుండా అమలు చేయాలని వారంలో రెండుసార్లు గ్రామాలను సందర్శిస్తూ గ్రామాలలో జరుగు



డిఐజికి పూలమొక్కను అందజేసి స్వాగతం పలుకుతున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్





రికార్డులను పరిశీలిస్తున్న డిఐజి ఎల్.ఎస్. చౌహాన్

అసాంఘిక కార్యకలాపాల పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ మండలంలో ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న నిర్వహిస్తూ వాహనాల ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. పోలీస్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉండాలని సూచించారు. జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని రాజీ కుదుర్చుకుంటున్న వారిని సంప్రదించి న్యాయబద్ధంగా రాజీ కుదుర్చాలని సూచించారు. పోలీస్టేషన్ రికార్డులను 5ఎస్ విధానాన్ని అమలు చేసి ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి సమయాలలో గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను అరికట్టే దిశగా సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎస్పీ తీసుకుంటున్న చర్యలపై డిఐజిసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, జిల్లా పోలీసు కార్యాలయ ఏ,ఓ సునందన, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, కృష్ణయ్య, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, సిసిఎస్ సీఐ, రవిపాల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వామ్మో చిరుత..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

వెళ్లిపోయాయి. తాజాగాటీడీగుట్ట వద్ద కూడా గురువారం టీడీగుట్ట వద్ద చిరుత కనిపించడం స్థానికులను మరింత ఆందోళనకు గురి చేస్తున్నది.

**సీసీ టీవీలు డ్రోన్లు ఉపయోగించండి..** ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చిరుత పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టాలని మహ బూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అవసరమైన చోటబోనులు ఏర్పాటు చేయాలని, సిసిటీవీలు డ్రోన్లు ఉపయోగించి ఎలాగైనా చిరుతను పట్టుకొని అడవిలో వదిలేయని అధికారులను ఆదేశించారు. అవసరమైతే అధికారులతో మాట్లాడి హైదరాబాద్‌నుంచిప్రత్యేక సిబ్బందినితీసుకురావాలని సూచించారు.

## కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు కార్యదర్శి నరసింహ

**అలంపూర్ సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** అలంపూర్ మండలంలో సిఐటియు మండల మూడవ మహాసభ మండల నాయకుడు లక్ష్మణ అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వి.వి నరసింహ హాజరై మాట్లాడుతూ కార్మికవర్గానికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఉన్న దాని అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఉద్యోగ భద్రత పెన్షన్ రిటర్మెంట్ ఇవ్వడంలో అలాగే పారిశుద్ధ కార్మికులను పర్మినెంట్ చేసి వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం కట్టు బానిసలు చేసే విధంగా కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడలుగా తీసుకొచ్చిందని దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. అలాగే అల్లంపూర్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలల పెండింగ్ జీతాలు తక్షణమే ఇచ్చి కేటగిరి వారిగా జీతాలు చెల్లించాలని పిఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యం సక్రమంగా అమలు చేసి సబ్బులు, బట్టలు, నూనెలు, చెప్పులు తదితర పరికరాలు ఇవ్వాలని అమలుచేయాలని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎమ్మెలమ్మ, సిఐటియు మండల నాయకులు నాగేశ్వరమ్మ, శారద, రాధా, లక్ష్మన్న, లక్ష్మీ నారాయణ, ఏసేపు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## చెస్ ఆట ఆలోచన దృక్పథం పెంచుతుంది

■పాలమూరు ఎన్నారై ఫోరం కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి

**ధన్వాడ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** ధన్వాడ మండల పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 203 చదరంగం బోర్డులతో పాటు చెస్ పుస్తకాలు కూడా పంపిణీ చేయడం జరిగింది. పాలమూరు ఎన్నారై ఫోరం కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు ఎన్నారై ఫోరం చెస్ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలో తీసుకోవాలని యూత్, విద్యార్థుల ఎక్కువ సంఖ్యలో మొబైల్ ఫోన్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు కాబట్టి ఇలాంటి టైంలో ఒక గేమ్‌ఉంటే ఎలా ఉంటుందని ఆలోచన దృక్పథంతో మొదలైన ఈ గేమ్ చేస్, ఆట విద్యార్థులకు ఆలోచన దృక్పథం పెంచుతుంది, ఎలా విజయం సాధించి దిశగా చెస్‌ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఏదైనా ఆటలు ఆడేటప్పుడు ఉదాహరణకు ఒక క్రికెట్ తీసుకుందాం ఈ ఆటలో 11మంది ఆడతారు కానీ ఎవరో ఒకరు మంచిగా ఆడకపోయినా గెలవలేక పోతారు. కానీ ఈ చదరంగం ఆటలో గెలిచిన ఓడిన ఒక్కరే ఆడుతారు. అంటే తప్పు ఎవరు చేశారు అన్నది తెలిసిపోతుంది. ఎందుకుఓడిపోయానుఅనే కారణం తెలుసుకుంటాం ఇప్పుడు ముందుకు వెళ్లడానికి ఈ గేమ్ ఉపయోగ పడుతుంది. పాల మూరు ఎన్నారై ఫోరం సభ్యులు రవి మీరెడ్డి, చెస్ నెట్వర్క్ టీంసుధీర్, సంజయ్, హరిరాజ్, రాజన్న, చదరంగం బోర్డులను స్పాన్సర్స్ శివారెడ్డి ఈ కార్యక్రమంలో పాలమూరు ఎన్నారై ఫోరం కన్వీనర్ మహిపాల్‌రెడ్డి మండల విద్యాధికారి గాయత్రి. బాలుర ఉన్నత పాఠశాలప్రధానో పాధ్యా యులు ప్రదీప్ కుమార్, నరసింహచారి ఉపాధ్యాయులు, కేజీబీవీ ఎస్ఓ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జన్మదినోత్సవం

**నారాయణపేటటౌన్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ జన్మదిన వేడు కలు గురువారం నారాయణపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు బండి వేణు గోపాల్‌తో కేక్ కట్ చేయించి శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్‌కుమార్, పెరపళ్ళ, జాజాపూర్, నారాయణపేట పట్టణ యువజన కాంగ్రెస్ నాయకులు 14వ వార్డు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బండి వేణు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి

**గద్వాలటౌన్, సెప్టెంబర్11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను గ్రామాలలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ లో ఉపాధి హామీ పనుల జాతర2025పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని, అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు మండల వారీగా, గ్రామ పంచాయతీ వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలుతీసుకోవాలని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాలకు వెళ్లి కూలీలను చైతన్యవంతం చేసి ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. జిల్లాలో కొత్తగా 29 గ్రామ పంచాయతీ భవనాలు, 29 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనులు ఏఏ గ్రామాల్లో, ఏ ఏజెన్సీ ద్వారా చేపట్టాలో స్పష్టంగా నిర్ణయించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ గ్రామాన్ని ఎంపిక చేసి పనులు చేపట్టాలని అన్నారు. నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎంపికచేసిన పాఠశాలల్లో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశువుల పాకలు, మేకల పాకలు, అజోల్లా యూనిట్లు, చెక్ డ్యాంలు, పౌల్ట్రీ షెడ్స్, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ నాగేంద్రం, పంచాయతీ రాజ్ ఈ.ఈ దామోదర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి సునంద, ఎంపిడిఒలు, డి.ఈలు, ఎ.ఈలు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

## అంగన్వాడీలకు ట్యాబ్స్, బ్లూటూత్ స్పీకర్ల పంపిణీ

**గట్టు మండల అభివృద్ధిలో ఎల్‌టిఐ మైండ్‌ట్రీ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం : జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్**

**గద్వాల టౌన్ సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** నియోజక వర్గంలోనీ గట్టు మండల అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు 49 ట్యాబ్ లు, బ్లూటూత్ స్పీకర్లు అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు గట్టు మండలములో అభివృద్ధి కార్యక్రమాలపై ఎల్‌టిఐ మైండ్‌ట్రీ సంస్థ సహకారంతో నడుస్తున్న శిక్షణ ఫౌండేషన్, భవిష్య భారత్, నేషనల్ అగ్రో ఫౌండేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గట్టు మండల అభివృద్ధిలో ఎల్‌టిఐ మైండ్‌ట్రీ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. నీతి అయోగ్ సూచించిన 39 అంశాలపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. గట్టు అంగన్వాడీ కేంద్రాల్లో 7 సూచికలలో నమోదు శాతం తక్కువగా ఉన్నందున వాటి అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎల్‌టిఐ మైండ్‌ట్రీ సంస్థ దక్షిణ జోన్ హెడ్ లలిత ఆర్.హుల్లా మాట్లాడుతూ గట్టు మండలంలోని 23 పాఠశాలలలో ప్రేరణ - ఎఫ్.ఎల్.యెన్ ప్రోగ్రామ్, స్టెమ్ అవగాహన" కార్యక్రమం అమలు అవుతోందని, అదనంగా 6హైస్కూల్‌లలో డిజిటల్ స్కిల్స్ శిక్షణ అందిస్తున్నామని వివరించారు. భవిష్య భారత్ ప్రతినిధులు మాట్లాడుతూ సమగ్ర గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్ట్ కింద అంగన్వాడీ అభివృద్ధి, చెక్‌డ్యామ్‌లు, సహజ వ్యవసాయం, స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి యూనిట్లు, స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నేషనల్ అగ్రో ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత కార్యక్రమాలు, చెక్‌డ్యామ్‌లు, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద, గట్టు అంగన్వాడీ సూపర్వైజర్ సంధ్య రాణి, నీతి అయోగ్ కోఆర్డినేటర్ అఫ్జల్, నేషనల్ అగ్రో ఫౌండేషన్ సభ్యులు రమేశ్, విజయ్, రంగస్వామి, భవిష్య భారత్ సభ్యులు రాజశేఖర్, వినయ్, శిక్షణ ఫౌండేషన్ సభ్యులు కాశీనాథ్ పాల్గొన్నారు.



అంగన్వాడీ టీచర్లకు సాంకేతిక పరికరాలను అందజేస్తున్న కలెక్టర్

## గురుకుల విద్యాసంస్థలకు నాణ్యమైన..

## సన్న బియ్యం సరఫరా అయ్యేలా చూడాలి

అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్

**వనపర్తి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలకు నాణ్యమైన సన్న బియ్యం సరఫరా అయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. గురువారం అదనపు కలెక్టర్ తన ఛాంబంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ డిఎం జగన్‌తో కలిసి అన్ని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల డీసీవోలతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు నాణ్యమైన సన్న బియ్యం మాత్రమే సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. నాణ్యతలేని బియ్యం వస్తే వాటిని వెంటనే వెనక్కి పంపించేయాలని సంక్షేమ గురుకులాల అధికారులకు సూచించారు. ఈ విషయంపై ఆయా వసతి గృహాల ఇన్చార్జిలకు గట్టిగా సూచించాలని తెలియజేశారు. బియ్యం విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే గురుకులాల ఇన్చార్జులు, డీసీవోలు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలేని బియ్యాన్ని విద్యార్థులకు పెట్టడానికి వీలు లేదని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా మైనారిటీ అధికారి అఫ్జలుద్దీన్, డీసీజీవో శుభలక్ష్మి, డిసిఓలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గురుకుల విద్యాసంస్థల డీసీవోలతో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్

## అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు

**నారాయణపేట, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మొరం ఇసుక తరలింపు జరుగుతుందనే సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ కోస్గి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు అర్ధరాత్రి జరిగిన ఈ ఆపరేషన్‌లో రెండు టిప్పర్లు ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. మొరం తరలిస్తున్న టిప్పర్ల డ్రైవర్లు టి.వంశి, శ్రావణ్ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మధు రెడ్డిని పట్టుకొని కోస్గి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరి మీద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కోస్గి ఎస్సై బాలరాజు, ఆంజనేయులు తెలిపారు. అలాగే కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆహారం అందించాలని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో సౌకర్యాలు, భోజనం, బోధన ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువు పైనే దృష్టి ఉంచాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలనపాటించాలని సూచించారు.

## పశువుల దొంగల అరెస్టు రూ.14.5 లక్షల ఆస్తి స్వాధీనం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పశువులను దొంగతనం చేయబడ్డారని తెలిపాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు తేది11 గురువారం ఉదయం 7 గంటల సమయంలో నవాబ్‌పేట్ పోలీసులు కన్మన్ కల్వ గ్రామ శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను బొలెరో వాహనంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు పశువుల దొంగతనాలను చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుండి 15 ఆవులు దూడలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో నిందితులు ఎ1గా మహమ్మదాబాద్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి అశోక్ కుమార్, ఎ2సర్దన్ అఖిల్, బొమ్మకల్, కరీంనగర్ జిల్లా ఎ3: తాటిపల్లి సాయి కుమార్ ముకుందపురం, నల్గొండ జిల్లా ఎ4: బుర్క సాయి, జనగాం, వరంగల్ జిల్లాగా గుర్తించారు. అనంతరం నవాబుపేట ఎస్సై విక్రమ్ పోలీస్ సిబ్బందికి ఎస్పీ జానకి డిఎస్పి వెంకటేశ్వర్లు సిఐ గాంధీ నాయక్ చేతుల మీదుగా రివార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకితో పాటు డీఎస్పీ వెంకటేశ్వర్లు సిఐ గాంధీనాయక్ నవాబుపేట ఎస్సై విక్రం, ఏఎస్ఐ జానర్ధన్, జి.వెంకట్రాములు, సురేష్ బాబు, భాస్కర్, శెట్టినాయిక్, అశోక్‌లు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

◆ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబరు11 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంకా నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో గ్రౌండింగ్ చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో సీజనల్ వ్యాధులు, ఇందిరమ్మ ఇండ్లు సహా తదితరాంశాలపై కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి ఎంపీడీవోలతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంకా నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో గ్రౌండింగ్ చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపాలిటీలలోచాలా నెమ్మదిగా గ్రౌండింగ్ సాగుతోందని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వార్డ్ ఆఫీసర్లతో లబ్ధిదారులందరినీ పిలిపించి గ్రౌండ్ చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఎంపీడీవోలు ఏపీఎంలతో సమన్వయం చేసుకొని లబ్ధిదారులకు స్వయం సహాయక బృందాల ద్వారా రుణాలు ఇప్పించే సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇకవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించి తెలియజేయాలన్నారు. అన్ని మున్సిపాలిటీలో గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు వారానికి ఒకసారి లేదా పది రోజులకు ఒకసారి శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్యాంకులకు సంబంధించి క్లీనింగ్ రిజిస్టర్ మైంటైన్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎంపీడీవోలు అందరూ తమ పరిధిలోని సంక్షేమ గురుకుల విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీలు చేయాలని, అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే వాటిని దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా విద్యా సంస్థల్లో నీరు నిల్వ ఉండే ఆస్కారం లేకుండా, అదేవిధంగా పిచ్చి గడ్డిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలోడిఆర్డిఓ ఉమాదేవి, హౌసింగ్‌డిఈ విఠోబా, డిడబ్ల్యుఓ సుధారాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.